సమ్మక్క-సారక్క ప్రసాదం పంపిణీ

ప్రసాదం పంపిణీ చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, మార్చి12: సమ్మక్క-సారలక్క మేడారం జాతర ప్రసాదాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పంపిణీ చేశారు. ఆర్టీసీ ద్వారా బుకింగ్ చేసిన ప్రసాదాన్ని ఆర్టీసీ అధికారులకు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రసాదాన్ని బుక్ చేశామని, ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. ప్రసాదాన్ని అందించిన వారిలో ఆర్టీసీ సీఐ దేవేందర్‌గౌడ్, ఎగ్జిక్యూటివ్ మసూద్ రవి ఉన్నారు.

వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

వనపర్తి టౌన్, మార్చి 12 : జిల్లా కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డికి మంగళవారం వాల్మీకి సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. స్వామి వివేకానంద చౌరస్తాలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తానే దగ్గరుండి ప్రతిష్ఠింపచేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ దేవన్ననాయుడు, రవి, వెంకటేశ్, రాఘవేంద్ర ఉన్నారు.

సీఎంఆర్ ధాన్యం త్వరగా అప్పగించాలి

● వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, మార్చి 12 : కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన సీఎంఆర్ ధాన్యం త్వరగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖల అధికారులు, సిబ్బందితో సీఎంఆర్ రైస్, గ్యాస్ సిలిండర్ల సరఫరా, పెట్రోల్ బంక్‌లోని నిర్వహణ, మౌలిక సదుపాయాలపై మంగళవారం సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా రైస్ మిల్లుల నుంచి కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన వరి ధాన్యం అప్పగించడంపై పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లుల ధాన్యం అప్పగింతపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల నివేదిక అడిగారు. అలాగే జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యలపై నివేదిక ఇవ్వాల్సిందిగా కోరారు. అదేవిధంగా జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ఇతరత్రా సమస్యలను పరిశీలించి వెంటనే నివేదిక అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

సమస్యలను పరిష్కరించాలి

వనపర్తి, మార్చి 12 : తుది ఓటరు జాబితా ప్రకటన తర్వాత వచ్చిన కొత్త ఓటరు నమోదు ఫారాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో దిశానిర్దేశం చేశారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకునే విధంగా స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ పేర్లు ఉంటే పరిశీలించి తొలిగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్,యం.నగేశ్, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దంతనూరులో పర్యటిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

మదనాపురం, మార్చి 12 : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి రోగాలు దరి చేరవని అదనపు డీఎంహెచ్‌వో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని దంతనూరు గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న ఆయా కుటుంబాల సభ్యులను కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తాసీల్దార్ అబ్రహం లింకన్, వైద్యాధికారి భవానితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాలకు పలు సలహాలు, సూచనలు చేశారు. బుధవారం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో పుష్ప, ఆర్ఐ రాజేశ్వరీ, డీఐవో పరిమళ, ఆరోగ్య సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వసతి గృహాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి సుబ్బారెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 12 : ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో భోజనం అందించి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు దగ్గరగా ఉండి పర్యవేక్షించాలన్నారు. అనంతరం వసతి గృహ ఆవరణ, వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఆంజనేయులు ఉన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

అయిజ, మార్చి 12: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల సమీపంలో ఓ కారు బోల్తా పడింది. గ్రామస్తుల కథనం మేరకు.. గట్టు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎమ్మిగనూర్‌కు కారులో వెళ్తుండగా, రోడ్డు పనుల కారణంగా కంకర తేలి ఉండడంతో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయట పడినట్లు తెలిపారు. రోడ్డు పనులు నత్తనడకన జరుగుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మేడికొండ, తుపత్రాల, పులికల్ ప్రజలు వాపోతున్నారు. రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

టీబీ రహిత సమాజాన్ని నెలకొల్పుదాం

మదనాపురం, మార్చి 12 : టీబీ రహిత సమాజాన్ని నెలకొల్పుదామని జిల్లా టీబీ నియంత్రణ అధికారి వంశీ కృష్ణ అన్నారు. మండలంలోని నెలవిడిలో టీబీ సెల్ అధికారి భాషిత్‌ఖాన్ పీహెచ్‌సీ డాక్టర్ భవానిరెడ్డితో కలిసి మంగళవారం పర్యటించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో టీబీ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉంటే సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ సురేశ్, ఏఎన్ఎంలు చంద్రమ్మ, గ్రేస్, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, మార్చి 12 : వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. మండలంలోని గోన్‌పాడ్‌లో మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్‌భగీరథ, ఇతర శాఖల అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు వేసవిలో ఇబ్బందులు కలగకుండా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగు నీరు వృథా కాకుండా చూడాలని, నీటిని ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలని సూచించారు. మిషన్‌భగీరథ పైపు లైన్లు లీకేజీలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తాగునీరు, బల్క్‌వాటర్ సౌలభ్యత, నీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించి ఏడు రిజిస్టర్లు, క్లోరోస్కోప్ ద్వారా నీటి స్వచ్ఛతను పరిశీలించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, గ్రామ ప్రత్యేక అధికారి శివకుమార్ ఎంపీవో చెన్నయ్య, గ్రామ కార్యదర్శి సాలేమా, నీటి పరీక్ష పరిశీలకులు రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల్లేకుండా చూడాలి

అలంపూర్,మార్చి 12: వేసవిలో నీటిసమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జబ్బార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఎంపీవో చంద్రకళ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రధానంగా పారిశుధ్య, నీటి సమస్యపై దృష్టిసారించాలన్నారు. బోర్ల మరమ్మతులు, పైపులైన్ల లీకులు, అవసరమైన చోట కొత్త బోర్లు వేసి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.కోటి మంజూరు చేసిందని, అవసరమైన ప్రాతిపదికన నిధులు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లోరోస్కోప్ ద్వారా నీటి స్వచ్ఛతను పరిశీలించే విధానాన్ని పరిశీలిస్తున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

మామిడి తోటల పెంపకంపై వీడియో కాన్ఫరెన్స్

మల్దకల్, మార్చి 12 : మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల పెంపకంపై మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యవసాయాధికారులు, రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో వీసీ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఏవో గోవింద్, ఏడీఏ సంగీత లక్ష్మీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మామిడిలో పిందె రాలడం, వాటి నివారణ చర్యలు గురించి, పండ్ల పరిశోధన స్థానం సంగారెడ్డి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర అవగాహన కల్పించారు. అలాగే అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల వివిధ పంటలలో జరిగే నష్టాలు, వాటి నివారణ చర్యలు గూరించి అసోషియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల అవశ్యకతను డాక్టర్ ప్రగతి కుమారి వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తల ఎలక్ట్రానిక్ విభాగం సంయుక్తంగా రూపొందించిన వంటి మామిడిలో చీడపీడల నివారణ, అధిక ఉష్ణోగ్రత ప్రభావంవల్ల పంటల్లో జరిగే నష్టాలు వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవోలు రాజశేఖర్, ప్రతాప్, శ్రీలత, మహాలక్ష్మి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై ..

అయిజ, మార్చి 12: పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణంలోని రైతు వేదికలో హాజరైన రైతులకు పలు అంశాలపై నివృత్తి చేశారు. మామిడి పంటలు సాగు చేస్తున్న రైతులకు చీడపీడలు, అధిక ఉష్ణోగ్రతతో మామిడి పంటలకు వచ్చే నష్టాలు, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఫ్రూట్స్ రీసెర్చ్ సుచిత్ర, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రగతి కుమారి, ఏడీఏ సక్రియానాయక్, ఏఈవో, ఏఈవోలు పాల్గొన్నారు.

మల్దకల్ రైతు వేదికలో వీసీలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారులు



అయిజ రైతువేదికలో పాల్గొన్న అధికారులు, రైతులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

అయిజ, మార్చి 12: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం అయిజ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ద్వితీయ సంవత్సరం భౌతిశాస్త్రం, అర్థశాస్త్రం, ఒకేషనల్ విభాగం పరీక్షలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా సాగుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఎస్ రాజేందర్, డీవో, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

గద్వాల అర్బన్, మార్చి 12 : జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే దంపతులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జ్యోతిలను మెప్మా ఆర్‌సీ మహిళా సంఘ నాయకురాలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు.

మిగిలిన పనులను చేపట్టాలి

వనపర్తి, మార్చి 12 : పట్టణంలో మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు కొత్త మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తెలిపారు.మంగళవారం మున్సిపల్ వైర్మన్ చాంబర్‌లో కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను కౌన్సిలర్స్‌తో కలిసి వైస్ చైర్మన్ శాలువా కప్పి సన్మానించారు. వేసవిలో నీటిఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మున్సిపల్ పరిధిలోని శానిటేషన్‌పై ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని కోరారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని గుర్తించి వెంటనే పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, నాగన్నయాదవ్, బీఆర్ఎస్ నాయకులు రహీం, డ్యానియల్, రమేశ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గట్టు, మార్చి 12 : మండలంలోని ఆలూరు శివారులో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ.800లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు

కొత్తకోట, మార్చి12 : ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలంటూ ఎస్పీ ఆదేశానుసారం కొత్తకోట పట్టణ కేంద్రంలో సీఐ రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ స్కూల్ నుంచి పలు కాలనీల్లో కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు సీఐ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మంజునాథ్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నారు.

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, మార్చి12 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు, సాయుధ దళ బలగాలచే కవాతు నిర్వహించడం జరుగుతుందని ఎస్సై వేణు అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండలకేంద్రంలోని ప్రధానరోడ్డు వెంబడి పోలీసు, సాయుధ దళ బలగాలచే కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా రాఘవేంద్రుడి పాదుకపూజలు

గద్వాలటౌన్, మార్చి 12 : గురు రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని షేరెల్లివీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం స్వామివారికి విశిష్టపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అలాగే పాదుక పూజ, కనక పూజలు చేశారు. అనంతరం ప్రహ్లాదరాయ ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. శేషదాస, రాఘవేంద్ర భజన మండలి సభ్యులు భక్తిగీతాలు, కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ వినాయక కర్త ప్రభాకర్, మేనేజర్ నరహరిజోషి, పాంచజన్య పాల్గొన్నారు.

స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

గద్వాలటౌన్, మార్చి 12 : ఎన్‌సీడీ స్క్రీనింగ్ క్యాంపులను ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమెతో పాటు రాష్ట్ర సీవీహెచ్‌వో డాక్టర్ అబ్దుల్ వాసే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్క హెచ్‌డబ్ల్యూలో ఎన్‌సీడీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. స్క్రీనింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండలాలో స్క్రీనింగ్ శాతం తక్కువగా ఉందని పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప, డాక్టర్ రాజు, శ్యాంసుందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

వడ్డేపల్లి, మార్చి 12: మండల కేంద్రంలోని జూలేకల్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆర్‌డీవో పీడీ నర్సింహారావు పరిశీలించారు. రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సూచించారు. గ్రామంలో ఎంతమంది కూలీలకు ఉపాధి కల్పించారు, వారికి ఎలాంటి సౌకర్యాలను కల్పించారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్‌కుమార్, ఏపీవో కుమార్, ఎఫ్ఏ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

కొత్తకోట, మార్చి 12 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రాంబాబును మంగళవారం వాల్మీకి ఉమ్మడి మండలాల అధ్యక్షుడు భీమన్ననాయుడు, బీసీ సంఘం నేత సాయికృష్ణ శాలువాతో సన్మానించారు.

కనులపండువగా స్వామివారి రెండో సవారి

ఆత్మకూరు, మార్చి 12: ఆత్మకూరు పరమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో సవారి(రథోత్సవం) కన్నుల పండుగగా సాగింది. భక్తులు చెరువు తీరంలో దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఆరంభమైన పల్లకీసేవ వేడుకగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ప్రత్యేక అథితులుగా హాజరై పల్లకీసేవ, రథోత్సవాన్ని నిర్వహించారు. పల్లకీసేవ ఊరేగింపు పొడవునా కుర్వడోళ్ల వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. పల్లకీసేవ అనంతరం జరిగిన రథోత్సవంలో శివనామస్మరణం మార్మోగింది. నేడు మూడో సవారి వైభవంగా నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నట్లు పూజారి కరిబసయ్య తెలిపారు. కమిషనర్ నాగరాజు పర్యవేక్షణలో జరిగిన మహోత్సవంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ధరూరు/ పాన్‌గల్/ కొత్తకోట/అయిజ, మార్చి 12 : జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలోని ఆయా మండలాల్లోని వివిధ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ధరూరు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, పాన్‌గల్ మండలంలోని దవాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కొత్తకోట మండలంలోని అమడబాకుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, భూత్కూర్ పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో కృష్ణయ్య, హెచ్ఎంలు ప్రతాపరెడ్డి , బద్రూనాయక్, సూర చంద్రశేఖర్, నరేందర్‌గౌడ్, శ్రీలత, లక్ష్మి, అరుణ, అమరేందర్‌రెడ్డి ఉపాధ్యాయులు లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు. అయిజ మండలంలోని ఉత్తనూర్ జెడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలన దినోత్సవం, పదో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటివారికి పాఠాలు బోధించారు. హెచ్ఎం తిమ్మారెడ్డి అభినందించి ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబేలు, శ్యాంసన్, లక్ష్మారెడ్డి, వీరన్న, అరుణ పాల్గొన్నారు.

ధరూర్‌లో విద్యార్థులతో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

ఉత్తనూర్‌లో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

గుర్తింపు లేని వాహనాలకు వేలం

వనపర్తి టౌన్, మార్చి 12 : వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకు పోలీసుల ఆధీనంలో 78 వాహనాలు ఉన్నాయని అందుకు సంబంధించిన వివరాలను ఫేస్‌బుక్, ట్విటర్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచినట్లు ఎస్పీ చెప్పారు. ఇందులో 2 నాలుగు చక్రాల వాహనాలు, మూడు త్రిచక్ర వాహనాలు, 73 బైక్‌లు ఉన్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటిని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నాగవరంలో ఉంచామని, రిజిస్ట్రేషన్ నెంబర్, ఇంజన్ నెంబర్, చాసీస్ నెంబర్ ఆధారంగా బాధితులకు గుర్తించి అప్పగించామని తెలిపారు. వాహనం యొక్క ఆర్సీ సర్టిఫికెట్లు తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నోడల్ అధికారి ఎ.శ్రీనివాస్‌కుమార్ 87126 70604 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ వాహనాలను ఎవరూ తీసుకొని పక్షంలో ఈనెల 20వ తేదీన చట్టప్రకారం బహిరంగ వేలం వేస్తామని తెలపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనాపురం, మార్చి 12 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై శేఖర్ రెడ్డి కథనం మేరకు మండలంలోని కొన్నూరు గ్రామ శివారులో 55 ఏండ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుడి తెల్ల అంగి, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని, మృతుడిని ఎవరైనా గుర్తిస్తే మదనాపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మృత దేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ దవాఖానాకు తరలించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ..

గోపాల్‌పేట, మార్చి 12 : అనుమానాస్పద స్థితిలో మహిళా మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు... రేపల్లి మండలంలోని శానాయిపల్లికి చెందిన సాతర్ల లక్ష్మమ్మ (50)కు నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లికి చెందిన కుర్మయ్యతో కొన్నేండ్ల కిందట వివాహమైంది. కొంతకాలం తర్వాత భార్యాభర్తలు విడిపోయారు. అప్పటి నుంచి లక్ష్మమ్మ తల్లిగారి ఊరిలో అన్నగారి కొడుకుల వద్ద ఉంటుంది. ఇదిలా ఉండగా సోమవారం రేపల్లి శివారులోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాల్వ టన్నెల్ వద్ద బ్రిడ్జి కింద కాల్వలో అనుమానాస్పద స్థితిలో శమమై కనిపించింది. ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలు లక్ష్మమ్మగా గుర్తించారు. మంగళవారం మ